



## 1

ఆ పల్లెటూరు పేరు ఫలానా అని చెప్పటం అనవసర మనిపిస్తుంది ఎందుకంటే దాన్ని ఏ పేరు పెట్టి పిలిచినా ప్రమాదం లేదు ఆ పల్లెటూరూ అన్ని పల్లెటూళ్ల లాటిదే అంటే సినిమాల్లోనూ కావ్యాల్లోనూ స్వర సీమ అనుకోటం చాలా పొరబాటు అది ధానధర్మాల కిల్లు కాదు కక్షలకీ స్పర్థలకీ పుట్టిల్లు! ఆవూళ్లో ఎందరు మనుషు లున్నారో అన్ని పార్టీలున్నయ్యంటే అతిశయోక్తి కావచ్చును కాని అసత్యం మాత్రం కాదు ఎవరినోట విన్నా ఇంకో మనిషినిగురించిన దుష్ప్రచారం తప్ప మరొకటి వినబడదు ఎవర్ని కదిలించి చూసినా స్వార్థపు గుట్టలూ, స్పర్థపు గుట్టలూ, కనిపిస్తయ్ ఏదో పార్టీకి చెందని మనుషులు మచ్చుకి ఒకళ్లకంటె ఆవూళ్లో దొరక్క పోవచ్చు ఆ మనిషి ఈ సంకుచిత దుర్గంధంలోంచి ఎప్పుడు బైటపడతానా అని అల్లాడిపోతూంటాడు ఆ పల్లెటూళ్లో వేరే పనీ పాటా లేనట్లు కడవ చంకన పెట్టుకుని నూతికో చెఱువుకో నీళ్లకి బయలుదేరి దారిలో ప్రణయకలాపాలు సాగించే పడుచులు అసలే కనిపించక పోవచ్చును అంతమాత్రాన అది పల్లెటూరు కాదనటానికి వీల్లేదుమరి మళ్లీ మాట్లాడితే ఆ పల్లెటూరిలోనే అన్ని పల్లెటూళ్లూ మనకి కనిపిస్తయ్యంటాను

ఆ వూళ్లో ఏ పార్టీకీ చెందని వ్యక్తి ఒక్క దామోదరమే అందుకే దామోదరమంటే అన్ని పార్టీలనాయకులకీ కడుపుమంట ఏ తగాదాలలోనూ ఆయన చెయ్యిచేసుకోడు ఊళ్లో పంచాయతీబోర్డు ఎన్నికలొస్తే ఎటూ తనవోటు వెయ్యకుండా ఆనాడు ఊళ్లోనే లేకుండా వెళ్లిపోతాడు ఎన్నికల జ్వరం చల్లారేదాకా మళ్లీ ఊళ్లోకి తిరిగిరానే రాడు కనకనే ఆయన మీద ఊళ్లో కథానాయకులందరికీ అతికోప మంట

కాని దామోదరం ఇంటిముందు వేపచెట్టుకొమ్మల్లో త్రివర్ణపతాకం ఎగురుతూ వుంటుంది ఆపతాకం ఊళ్లో ఇంకే కొంపటిళ్ల మీదా, మేడల మీదా, ఎగరని రోజుల్లో కూడా దామోదరంగారి భవంతిముందు గాలిలోగర్వంగా కదులుతూ వుండేది ఆ జెండాని చేత్తో పుచ్చుకోటానికి గుండెలు పీచుపీచుమనే రోజుల్లో కూడా దామోదరంగారి వేపచెట్టు కొమ్మల్లో నిర్భయంగా త్రివర్ణపతాకం నాట్యంచేసేది ఆ పతాకం దామోదరంగారు భవనాల్లో నివసించినా, పెంకుటింట్లో కాపురమున్నా, చివరికి పూరికుడిసెలో కాలం వెళ్లదీస్తున్నా తన నాట్యం నిర్విఘ్నంగా సాగిస్తోంది దామోదరం ఒకనాడు ఆ వూళ్లో లక్షాధికారి అన్న సంగతి కొద్దిమందికి మాత్రమే గుర్తుంది ఆ రోజుల్లో డబ్బుని ఎంత నిర్లక్ష్యంగా ఇతరుల మేలుకోసం వెదజల్లాడో తెలుసుకోవాలంటే ఆ వూళ్లో పాఠశాలని అడిగినా, వైద్యశాలని అడిగినా, చెఱువుగట్టు నున్న ధర్మశాలని అడిగినా, రేవుల్లో తీర్చిదిద్దినట్లున్న సిమెంటు మెట్లని అడిగినా వెయ్యి గొంతులతో చాటి చెప్పగలవు ఒకప్పుడు తామరతోనూ నాచుతోనూ పెనవేసుకుపోయి మురికిగుంటలాగా అన్ని రోగాలకీ ఆలవాలంగా వుండే ఆ కాలవ ఇవాళ తేటనీటితో తొణికిసలాడటానికి కారణం కూడా దామోదరంగారి డొ

ర్యమే చెఱువుకి మాన్యం వున్నా, దాన్ని స్వార్థపరులు నిరంకుశంగా అనుభవిస్తుంటే చేతిడబ్బు వేసుకుని దామోదరంగారు బాగుచెయించారు ఏ శేటా తరుణంలో చెఱువుకి నీళ్లు పట్టించటం ఆయనవొంతూ, ఏడాదిపొడుగునా తాగటం మిగతావాళ్ల వొంతూ! ఊరు బాగుచెయ్యాలని ఇన్ని విధాల పాటుబడినా ఆయనకి దక్కిన ప్రతిఫలం ఏముంది? అనారోగ్యం, దరిద్రం, అనాదరణ మనుషులు శిశువులకంటే వట్టి వాళ్లు పాలిచ్చేతల్లి చన్ను శిసువు కొరికితే, తన మేలుకోరేవాణ్ని ఏవగించుకుంటాడు మనిషి!

ఈనాడు దామోదరం స్థితి చితికిపోయింది పువ్వులమ్మిన వూళ్లోనే పుడకలమ్మవలసి వచ్చింది ఆర్థిక స్థితితోపాటు శరీరస్థితి కూడా అన్ని ఉద్యమాలలోనూ ముందుకి దూకి చెఱసాలల్లో ఏళ్ళతరబడి కుమిలిపోవటంవల్ల పూర్తిగా చెడిపోయింది అయినా ప్రతిరోజూ ఉదయంపూట మూడు గంటలసేపు నూలువడకటం మానెయ్యలేదు తుమ్మెదలు ఝుంకరించినట్లు చర్ఖా ప్రతిరోజూ మోగుతూనేవుంది జీవితంలో ఎన్ని దెబ్బలు తిన్నప్పటికీ, పరిస్థితి ఎంత తారుమారైనప్పటికీ దామోదరంముఖంలో శాంత గంభీరముద్ర చెదరిపోలేదు ఆయన పెదవులమీద మధురదరహాసం మాసిపోలేదు తనమీద ఇతరులు ఎంత నిర్లక్ష్యం ప్రదర్శించినా తనమటుకు అందరినీ ఆప్యాయంగా ఆప్తబంధువుల్లాగా పలకరిస్తాడు ఎవరికి ఏ బాధవొచ్చినా ఆయన దగ్గరికి పరిగెత్తికెళ్లి ఉచితంగా తెల్లమాత్రలు తెచ్చుకుని తియ్యగా మింగుతారు ఆయన ఇచ్చే మందులు తియ్యగా వుంటయ్ కాని ఆయన మనస్సు అంతకంటే తీపిగా వుంటుంది!

అనాదినుంచీ ఆవూళ్లో దామోదరమే కాంగ్రెసుసంస్థకి ధ్వజస్తంభం ఆయనపేరు చెప్పుకునే చాలామంది వినాయకులు నాయకులై పదవులు సంపాదించుకున్నారు ఆయనకి పదవులకోసం పాకులాడటమంటే అరికాలిమంట చేతనైతే ప్రతిఫలం కోరని సేవచెయ్యాలి, లేకపోతే చేతులు ముడుచుకుని కూచోవాలని ఆయన దృఢ విశ్వాసం

కాని ఇటీవల దామోదరంగారు వృద్ధాప్యంవల్ల ఇల్లుకదలటం మానేశారు భగవద్గీత చదువుకుంటూ, చర్ఖా తిప్పుకుంటూ, బీదసాదల కష్టసుఖాలు విచారిస్తూ కాలక్షేపం చేస్తున్నాడు ఈయన గాంధీజీ చేదస్తపు శిష్యుల్లో ఒకడని చెప్పి తమకి ఎన్నికల ప్రచారానికీ, పదవుల మంతనాలకీ పనికిరాడని వినాయకులు తీర్మానించుకున్నారు చెప్పెక్కగానే నిచ్చెన తన్నేసినట్లు ఆయన పలుకుబడిని ఉపయోగించుకుని పెద్దవాళ్లయిన పెద్దమనుషులు ఆయన్ని చిన్న చూపు చూడటం మొదలుపెట్టారు అయినా దామోదరం వాళ్ల ప్రాపకంకోసం ఎప్పుడూ పాకులాడలేదు దేవుడికి తప్ప మరెవరికీ జంకని మనిషి కనక దామోదరం ఎవరినీ లక్ష్యం చెయ్యలేదు తన దారిన తాను పోతూ, ఇంకెవరి దారికీ అడ్డుపోకుండా బదకటమే ఆయన పద్ధతి

దామోదరం రాజకీయాలకి ఎడంగా తొలగిపోవటంవల్ల ఫాక్టరీ బసవయ్య ఆ పల్లెకి సాటిలేని మేటి కాంగ్రెసునాయకుడైపోయాడు పొరుగూరునించి ఏ నాయకుడొచ్చినా ఘనమైన స్వాగతాలు, విందులూ, సన్మానపత్రాలు ఇస్తాడు డబ్బువిరజిమ్మేసి వొచ్చినవాళ్ళు తిరిగివెళ్లేదాకా స్తోత్రాలు చేస్తూ కూడా కూడా నడుస్తాడు

బసవయ్య చేతులో కానీ లేని రోజుల్లో దామోదరమే డబ్బు ఇచ్చి వడ్లమర పెట్టించాడు ఆడబ్బు బసవయ్య తిరిగి ఇవ్వాలనీ అనుకోలేదు, దామోదరం తిరిగి పుచ్చుకోవాలనీ అనుకోలేదు భాగ్యచక్రం తిరిగింది బసవయ్య కుబేరుడు, దామోదరం కుచేలుడు!

మొదట్లో బసవయ్య కృతజ్ఞతఅనేజబ్బుతో కొన్నాళ్లు బాధపడ్డాడు తన భాగ్యానికంతకీ దామోదరమే కారకుడని నమ్మాడు కాని ఈ రోజు చేతులో కానీ లేని దామోదరంతో నోరు విప్పి మాట్లాడటమే తన పరువు ప్రతిష్ఠకి భంగమనిపిస్తుంది ఎన్ని ఇక్కట్లు వచ్చినా, ఎన్ని చిక్కులు వచ్చినా దామోదరం ఒక్కనాడు కూడా బసవయ్య దగ్గర చెయ్యి చాచి ఎరగడు దమ్మిడీ చేతులో లేనివాడి కుక్కడా ఎందు కింత తలపొగరని బసవయ్య బొజ్జ నిమురుకుంటూ ఎన్నోసార్లనుకున్నాడు అయినా కాంగ్రెసంతటి మహాసంస్థే తనమీద ఈనాడు ఆధారపడివున్నప్పుడు దరిద్ర దామోదరంతో మాట్లాడాల్సిన అవసరం తనకేముంది? ఇప్పుడు దామోదరాన్ని గురించి 'వాడు' అని ఏకవచన ప్రయోగం చేసి "వాడున్నంతకాలం మన వూరు బాగుపడదు" అని సిద్ధాంతంగా నొక్కిచెబుతాడు బసవయ్య తెల్లవారి లేస్తే తెల్ల టోపీల పెద్దలు చిన్నకార్లూ, జీపుకార్లూ వేసుకుని తన చుట్టూ తిరుగుతూవుంటారు ఇదంత చూస్తుంటే బసవయ్యకి ఈ ధరాచక్రమంతటికీ తనే ఇరుసయినట్లూ అది తనచుట్టూతా గిరగిరా తిరుగుతున్నట్లూ అనిపిస్తుంది

మనుషులు గడిచిన సంగతులు ఇట్టే మరిచిపోతారు ఈనాడు ఖద్దరుటోపీ, పంచా, లాల్చీ విడవని బసవయ్య పదేళ్లకి మునుపు గ్లాస్కోమల్లు తప్ప కట్టేవాడు కాదు ఆయన ఇంట్లోనూ మిల్లులోనూ రాజుగారి బొమ్మలుండేవి ఊరంతా జాతీయజెండా ఎగరేసినా ఆయన ఇంటిమీదా, ఫ్యాక్టరీమీదా ఎన్నడూ జెండా ఎగిరిన పాపాన పోలేదు అంతేకాదు గాంధీపేరు వింటే బసవయ్యకి గంగ వెర్రులెత్తేవి ఆగస్టువుద్యమంలో అందరు కుర్రాళ్లతోపాటు తనకొడుకూ కాలేజి మానేసి ఇంటికొస్తే అన్నంపెట్టక, చావగొట్టి, వెంటబెట్టి తీసికెళ్లి బలవంతాన కాలేజిలో దింపివచ్చాడు మిల్లులో పని చేసే కూలీ లెవరైనా ఖద్దరు కడితే చాలు కారాలూ మిరియాలూ నూరేవాడు అంతే కాదు, దామోదరం కుటుంబం వూళ్లో వుండటం అనర్థదాయకమనీ, వాళ్లవల్ల స్వరాజ్యం వెర్రి అందరికీ అంటుకుంటుందనీ ప్రభుత్వానికి విన్నవించిన విధేయ సేవకుడు బసవయ్య!

ఇంతెందుకు? జాతీయోద్యమప్రబల విరోధియైన బసవయ్య జాతీయప్రభుత్వపు ప్రాణమిత్రుడైపోయాడు వేషం మార్చేశాడు ఇనప్పెట్టెలో డబ్బుతోపాటు శరీరం కూడా పెరుగుతోంది కోరాఖద్దరు లాల్చీలోంచి బసవయ్య లంబోదరం దోబూచులాడుతూ వుంటుంది ఆగస్టు పదిహేనున అర్ధరాత్రి అమావాస్యనాడు స్వరాజ్యం వచ్చేసరికి ఆ వూళ్ళోదాన్ని సంరక్షించే భారమంతా బసవయ్య భుజస్కంధాలమీద పడింది మునుపు ప్రభుత్వవిరోధులైన దేశభక్తులని ఎంత నిఘాగా పట్టియిచ్చాడో ఇప్పుడు కూడా అంత భక్తిశ్రద్ధలతోటే కమ్యూనిస్టులని వేటాడటంలోనూ, అధికాహారోత్పత్తి కోసం విరివిగా చెట్లు నాటటంలోనూ, ఒకటేమిటి అన్నివిధాలా జాతీయప్రభుత్వానికి నమ్మిన బంటుగా నడుచుకుంటున్నాడు

ఇప్పుడు బసవయ్య వూళ్ళో 'తానా' అంటే మిగతా వాళ్లు 'తందానా' అంటారు ఆయన్ని కాదని ఆ గడ్డమీద బతకటం

(36-వ పేజీ చూడండి)

కుష్ఠు ★ బొల్లి

వగైరా మేహామచ్చలు, సెగ, సవాయి వ్యాధులకు, గ్యారంటి చికిత్స, క్యాటలాగు ఉచితం జి వి రెడ్డి అండ్ కో, (రిజిష్టర్డు) భాస్కరాశ్రమము గోపాలపురం, తూ గోదావరి

# నాడూ-నేడు

(10-వ పేజీ తరువాయి)

డుర్ఘటం పంచాయతీబోర్డు మొదలుకొని పార్లమెంటు ఎన్నికలదాకా బసవయ్యగారి మాట చెలామణి అవుతోంది. ఆయనతో ఏ స్వల్పమైన తగాదా వచ్చినా వాణ్ణి కమ్యూనిస్టుగా నిరూపించి ప్రభుత్వానికి అతిథిగా పంపితేగాని ఆయనకి నిద్రపట్టదు ఒక్కమాటలో చెప్పాలంటే ఇప్పుడా గ్రామానికి బసవయ్య ముకుటం లేని సార్వభౌముడు

## 2

కారుహారను మోత వినబడగానే వూళ్ళో జనమంతా తండోపతండాలుగా పొలాల్లోకి పారిపోయి దాక్కుంటున్నారు. కాళ్లలో శక్తి వున్నంతవరకూ వెనక్కి తిరిగి చూడకుండా ఎవరిమటుకు వాళ్ళు దూరంగా పారిపోతున్నారు అప్పటికే రెండుమూడుసార్లు మలబారుపోలీసుల లాఠీదెబ్బలు రుచిచూసివుండటంచేత మిలిటరీలారీ అంటే గ్రామస్తులందరికీ సింహస్వప్నమైపోయింది

ఆరోజు లారీ సరాసరి బసవయ్య భవంతి ముందే ఆగింది. ఈమధ్య ఆ గ్రామ మునసబు చనిపోవటంచేత ఆ పదవి కూడా బసవయ్యకే లభించింది ఇప్పుడు గ్రామంలో ఆయన మాటకి తిరుగులేదు

పారిపోకుండా వూళ్లో మిగిలివున్న ముసలివాళ్లనీ ఆడవాళ్లనీ మునసబుగారి ఇంటికి లాక్కువచ్చారు బసవయ్య మీసాలు మెలివేసుకుంటూ అందరి ప్రాణాలూ తన చేతుల్లోనే వున్నవన్న ధీమాతో పచార్లు చేస్తున్నారు "చెప్పండి నిజం చెప్పండి మీ వొంటిమీద ఒక్క దెబ్బపడకుండా చూస్తాను. ఆ చాకలి చంద్రాయి ఎక్కడ దాక్కున్నాడో చెప్పండి లేకపోతే మీ ప్రాణాలు దక్కవు" అని గర్జించాడు భయంతో వొణికిపోతూ అక్కడ గుమికూడినవాళ్లందరూ మాకు తెలియదు మొర్రో అని మొరపెట్టుకుంటున్నారు. అందరి గుండెల్లో రైళ్లు పరిగెడుతున్నయ్ ఇంకొద్దిసేపట్లో ఎప్పటిమాదిరి లాఠీలతో బాదటం మొదలైతే తమ పని ఏంకావాలి? తమరు ఏమీ ఎరగని నిరపరాధులు. తమని ఎవరు కాపాడుతారు ?

ఇంతలో ఛాతీ విరుచుకుంటూ "ఇదుగో వచ్చాను ఎందుకు నాతో పని వొచ్చిందో చెప్పండి"అంటూ చాకలిచంద్రాయి తోసుకుంటూ ముందుకి వచ్చాడు అక్కడికి బలవంతాన లాక్కువచ్చినవాళ్లందరూ అమ్మయ్య అని పెద్ద నిట్టూర్పు విడిచారు

"నేను ప్రభుత్వానికి విరోధినని రుజువు చెయ్యండి బసవయ్యగారూ ? తరవాత నన్ను మీరేం చేసినాసరే" అని చంద్రాయి సవాలు చేశాడు ఎల్లాగైనా వీణ్ని వూళ్ళోంచి పంపిస్తేగాని బసవయ్యకి మనశ్శాంతి వుండదు చంద్రాయి కొత్త చదువుకున్నవాడు గనక జనాన్ని పోగుచేసి పత్రిక చదివి వినిపిస్తాడు బసవయ్యగారికి పక్కతాళం వెయ్యడు రొమ్ము విరుచుకుని తిరుగుతాడు కాని పోలీసు అధికారి ముందు సవాలుచేసి అడిగేసరికి బసవయ్య గొంతున పచ్చివెలక్కాయ పడింది అయినా తడుముకోకుండా "వీడు పెద్ద నాయకుడు వీడు వూళ్ళోవుంటే గ్రామంలో శాంతి భద్రతలు వుండవు" అని బిగ్గరగా అన్నాడు

"అబద్ధం ఇదంతా అబద్ధం చంద్రాయి ఒకళ్ల జోలికి పోడు ఉప్పుసత్యాగ్రహంలో లాఠీదెబ్బలు కూడా తిన్నాడు వాడివల్ల గ్రామానికి మేలేకాని కీడు ఏనాడూ వాటిల్లదు" అని గంభీరస్వరం వినిపించింది అంతా వెనక్కి తిరిగి దామోదరం అక్కడికి రావటం చూసి ఆశ్చర్యపడ్డారు

"ఎవరు నువ్వు ?" అని అధికారి రీవిగా అడిగాడు

"నేనొక ప్రజాసేవకుణ్ణి అమాయక ప్రజలని విచక్షణలేకుండా హింసించవద్దని విన్నవించటానికి వచ్చాను" అని దామోదరం ముందుకి నడిచాడు అధికారి ఎంతో గౌరవించి తన పక్కన కూచోబెట్టుకుని చాలాసేపు దామోదరంతో ముచ్చటించాడు ఇదంతా వింటూ ఇంగ్లీషురాని బసవయ్య కొరకొరలాడుతూ కాలుకాలిన పిల్లిలాగా అటూ ఇటూ తిరిగాడు తన ఇంట్లోనే తన కింత తలవంపు జరిగినందుకు మంటలు మండిపోతున్నాడు

కొంచెంసేపట్లో వచ్చిన మిలిటరీలారీ తిరుగుదారిపట్టింది ఎవరికీ దెబ్బలు తగల్లేదు అంతా లోపల పొంగిపోయి ఇదంతా దామోదరంగారివల్లనే జరిగిందని ఆయన్ని వేనోళ్ల పొగడటం మొదలుపెట్టారు

ఇంటికి తిరిగివెళ్తూ దామోదరం "ఏం బసవయ్యా! అంతా క్షేమమా ?" అని మామూలుగా ఆప్యాయంగా పలకరించాడు బసవయ్య వినిపించుకోనట్లుగా ముఖం తిప్పుకుని వెళ్లిపోయాడు

తోక తొక్కిన తాచులాగా బసవయ్య మనస్సు బుసలుకొడుతోంది తనమీద ఇంగ్లీషులో అధికారికి దామోదరం ఏం చెప్పాడో ? ఈ దామోదరాన్ని వూళ్లోంచి వెళ్లగొడితేకాని తనకి స్థిమితంగా వుండదు ఎల్లాగైనాసరే ఈ శత్రువుని చుట్టుపట్ల లేకుండా తరిమివెయ్యాలి ఈ మంట ఎల్లా చల్లారుతుంది ?

## 3

ఆరోజు వూళ్లో పెద్ద సభ జరిపారు బసవయ్య దానికి అధ్యక్షత వహించాడు. తిండి దొంగల భరతం పట్టాలనీ, దొంగ బజారు రూపుమాపాలనీ, అధికాహారం ఉత్పత్తి చెయ్యాలనీ వేదికమీదినుంచి అధ్యక్షులు దీర్ఘంగా గంభీరంగా ఉపన్యసించాడు ఆ సభలో ఏదో ఒకమూల దామోదరం ఒదిగి కూచుని అంతా వింటున్నాడు సభ కొంచెంసేపటికి ముగుస్తుందనగా, బసవయ్య గొంతులో మార్దవాన్ని నింపుతూ "అనాదినుంచీ ప్రజాసేవలో తల నెరిసిన పెద్దలు దామోదరంగారు ఈ సభకి విచ్చేయటం మన అదృష్టం వారు నాలుగు ముక్కలు మాట్లాడాలని కోరుతున్నాను" అన్నారు జనం ఎంతో ఒత్తిడిచేశారు అంతా చాలా బతిమాలుకున్నారు కాని దామోదరం మాత్రం కూచున్న చోటినించి కదల్లేదు, నోరు మెదపలేదు సభ ముగిసే సమయంలో ఒక ఖాదీవాలా లేచి "మహాజనులారా! వచ్చే ఎన్నికల్లో పచ్చపెట్టెలోనే మీ వోటు వెయ్యాలి మన నియోజక వర్గంతరఫున అద్వితీయ ప్రజాసేవకులు, బసవయ్యగారు నిలబడతారు వారిని గెలిపించే భారం మీది "అని ప్రచారానికి పూనుకోగానే దామోదరం లేచి వెళ్లిపోయాడు ఆయనతోపాటు చాలామంది లేచి వెళ్లిపోయారు ఇల్లా లేచి వెళ్లిపోవటం బసవయ్యకి రేగిన పుండుమీద కారం జల్లినట్లుగా అనిపించింది దామోదరాన్ని మళ్లీ లేవకుండా అథఃపాతాళానికి తొక్కివేసే తరుణంకోసం బసవయ్య తహతహలాడుతున్నాడు

ఇల్లావుండగా ఒకరోజున ఊళ్లో ఏనోట విన్నా అదేమాట కార్తీకమాసంలో కూలీనాలీ చేసుకునే బీద జనం ఊళ్లో ధాన్యపుగింజ దొరక్క గిజగిజలాడి పోతున్నారు మోతుబరిరైతులు గాదెలకి తాళాలు బిగించుకున్నారు అటువంటి సమయంలో దామోదరం తన దగ్గరున్న పుట్టెడు ధాన్యమూ అడిగినవాళ్లందరికీ పంచిపెట్టాడు వాళ్ల ఆనందానికి పట్టపగ్గాలు లేవు ఆయన్ని దానకర్ణుడనీ, అటువంటి మహారాజు ఈ కలిలోనే లేడనీ జనమంతా కొనియాడారు ఆయన వాళ్లదగ్గర కంట్రోలు ధర మించి కానీకూడా పుచ్చు

కోలేదు ఆ సమయంలో అమ్మినా ధర్మంగా ఇచ్చినట్లే జనం పొంగి పోయారు

ఈ సంగతి వినగానే బసవయ్య అగ్గిలాగా మండిపోయాడు దామోదరం బీద సాదలని వశం చేసుకుని గ్రామంలో క్రమేణా గొప్ప విప్లవాన్ని లేవతీస్తాడనీ, ఆ కార్యక్రమానికి ఇది మొదటి మెట్టనీ బసవయ్య రుసరుసలాడాడు ఎల్లాగైనా సరే దామోదరం దరిద్రంవల్ల కాంగ్రెసు సిద్ధాంతాలని విడనాడి కమ్యూనిస్టవుతున్నాడని బసవయ్యకి తోచింది దామోదరం ధరించే ఖాదీ, తిప్పేచర్ఖా, అన్నీ కపటనాటకాలనీ, లోపల విప్లవభావాలున్నయ్యనీ, అందుకనే ఆనాడు అధికారిముందు చాకలి చంద్రాయిని సమర్థించాడనీ బసవయ్య తలపోశాడు ఈ శత్రువుని హతమార్చితీరాలని పట్టుపట్టాడు ఇప్పుడు పగ తీర్చుకునే ఉపాయంకూడా స్పష్టంగా అతనికి గోచరిస్తోంది

అయినా ముందు దామోదరాన్ని ఒకసారి కలుసుకుని మంచిమాట చేసుకోవాలనిపించి బసవయ్య అప్రయత్నంగా దామోదరం ఇంటికి బయలుదేరాడు ఎప్పటి మాదిరిగానే దామోదరం ఎంతో ఆప్యాయంగా సత్కరించాడు బసవయ్య గొంతు సవరించుకుని "మనలో మనకెందుకీ తగూలు?" అన్నాడు "నాకు నీతో తగూయేమిటి?" అని దామోదరం నవ్వుతూ అన్నాడు

"నువ్వు కోరినంత ధనమిస్తాను ఈ స్థలంలో నీకో పెద్ద భవంతివేయిస్తాను నీ పిల్లలకి చదువులకీ, పెళ్లిళ్లకీ అయిన ఖర్చంతా భరిస్తాను –"

"ఎందుకు బసవయ్యా! నామీద నీకింత దయ?" "ఏంలేదు ఇంత దీనావస్థలో నువ్వుండటం చూస్తుంటే కడుపు తరుక్కుపోతోంది" అని బసవయ్య మొసలి కన్నీళ్లు తుడుచుకున్నాడు

"దానికింత విచారపడటం దేనికి? ఓడలు బళ్లు, బళ్లు ఓడలూ! ఏదో పనిమీద వొచ్చినట్లున్నావ్?"

"అవును రేపటి ఎన్నికల్లో నన్ను గెలిపించేభారం నీ మీద పెడుతున్నాను నీ పలుకుబడి వుపయోగించి నన్ను గెలిపిస్తే నీకు కోరినధనమిస్తాను––"

"ఆపని ఎన్నటికీ నావల్లకాదు అనవసరంగా నా మీద ఆశలు పెట్టుకోకు"

"పోనీ నీవోటయినా నాకిస్తావా?"

"అసంభవం"

"అయితే ఇదే ఆఖరిమాటా? ముందువెనకలాలోచించుకో అనవసరంగా అవకాశాన్ని జారవిడుచుకోకు తరవాత పస్తాయించి లాభంలేదు"

"ముమ్మాటికీ ఇదే నా నిశ్చయం"

"అయితే కాసుకో నాపగ తాచుపాము పగ! నన్ను కాదని నువ్వీవూళ్లో నిమిషం బతకగలవా? చూస్తాను కాసుకో!"

"దైవం ఎన్నాళ్లు నన్ను బతకమని శాసించాడో అన్నాళ్లూ బతుకుతాను నాకేం భయంలేదు, బసవయ్యా జంకటం పిరికిపందల లక్షణం!"

"దగ్గరికొచ్చినయ్ లే నీ రోజులు" అంటూ బసవయ్య చరచరా వెళ్లి పోయాడు.

## 4

ఆ పుకారు దామోదరానికి కూడా వినిపించింది వూళ్లో గింజ దొరక్క జనం అలమటిస్తుంటే బసవయ్యగారి లారీ రాత్రి పూట ఉత్తరాదికి ధాన్యం తోలుకుపోతున్నది అక్కడ బస్తా యాభైదాకా అమ్ముతోందట ఈ దొంగలాభాలన్నీ ఖద్దరు లాల్చీచాటున దాక్కుంటున్నయ్

దీని నిజానిజాలు తేల్చాలని దామోదరం గట్టిగా సంకల్పించాడు ఎవరికీ చెప్పకుండా, ఇంట్లో అంతా పడుకున్నాక చేతులో బాణాకర్ర, ఇంకో చేత్తో టార్చిలైటూ పుచ్చుకుని వూరిబైట మర్రి చెట్లచాటున కూర్చున్నాడు ఎవరినీ తోడు తీసుకురాలేదు ఆయనకి దైవమే అంగరక్ష అని విశ్వాసం

దూరంనుంచి లారీమోత వినబడింది దామోదరం లేచి నిలబడ్డాడు లైట్లు మసకగా కనిపిస్తునయ్ వెళ్లి దారికిఅడ్డంగానిలబడ్డాడు. గుండెలు దడదడలాడుతున్నాయ్. వేగంగా లారీదగ్గిరికొచ్చేస్తోంది ఇంకొక్కగజం దూరంలో వుండగా టార్చిలైటు వెలిగించి "ఆపు ఆపండి" అని బిగ్గరగా కేకవేశాడు లారీ రక్కన ఆగింది లోపలినించి మనుషులు కర్రలతో మీదికి దూకారు

"అమ్మా!" అన్న అరుపు అర్ధరాత్రి నిశ్శబ్దాన్ని చీల్చివేసింది.

టార్చిలైటు వెలుతురు ముఖంమీద పడింది "బ-స-వ-య్యా" అంటూ దామోదరం కళ్లు తేలవేశాడు చిట్లిపోయిన దామోదరం తలలోంచి చిందినరక్తం బసవయ్య లాల్చీమీద సరిగా గుండెలదగ్గర పెద్ద డాగుగా పడింది

"రామ రామ" అంటూ దామోదరం ఆఖరి ఊర్పు విడిచాడు

దామోదరం చేతిలోంచి పట్టుతప్పి కింద పడిపోయిన టార్చిలైటుకి కాలు సూదుల్లాగా బసవయ్యని గుచ్చుతూ, అతని మనస్సులోకి చొచ్చుకుపోతున్నయ్. ఆకాంతి తన హృదయాంతరాళాలలోకి అగ్నిజ్వాలలాగా చొరబడుతోంది

కేకవిని జనం గుంపులుకూడేలోగా బసవయ్యా అనుచరులూ పారిపోయారు కాని దామోదరం చేతులోంచి జారిపడిపోయిన టార్చిలైటుకాంతి మటుకు బసవయ్యని వెన్నంటి తరుముతునేవుంది ★

